అధ్యయనోత్సవాలు పరిపూర్ణం

● చివరి రోజు లక్ష్మీనరసింహ స్వామిగా దర్శనం ● ముగిసిన అలంకార సేవలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో ఈ నెల 23న ప్రారంభమైన అధ్యయనోత్సవాలు గురువారం ముగిశాయి. స్వయంభూ ప్రధానాలయంలో నిత్యారాధనలు అనంతరం స్వామిని అలంకరించి ఆళ్వారాధుల ముందు ప్రబంధ పారాయణాలను పారాయణికులచే పఠించి, భక్తుల దర్శనార్థం తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామి వారి ఆలయంలో ఉత్సవమూర్తులకు తిరుమంజన, నవకలశ స్నపన మహోత్సవం ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు వేద పండితులు పాంచరాత్రాగమ సంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఇరామానుజ నుత్తందారి ఉపదేశరత్తినమాలై అనుసంధానం గావించి అధ్యయనోత్సవాలను పరిపూర్ణం చేశారు. అనంతరం అధ్యయనోత్సవాలకు విచ్చేసిన దివ్య ప్రబంధ పారాయణికులను ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు. ఉత్సవాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయాధికారులు రఘు, గజవెల్లి రమేశ్‌బాబు, గట్టు శ్రవణ్‌కుమార్, రాజన్‌బాబు, సురేందర్‌రెడ్డి, రాంమోహన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలంకార విశిష్టత : అధ్యయనోత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆరో రోజు స్వయంభూ పంచనారసింహ క్షేత్రంలో నృసింహ అవతారంలో స్వామి వారిని తీరు వీధి సేవ నిర్వహించారు. కృత యుగంలో తన భక్తుడైన ప్రహ్లాదుడి రక్షించేందుకు సింహముఖం, నరుడి శరీరంతో అవతరించిన అపూర్వ అవతారమే శ్రీ నరసింహ అవతారం. అంతటా కనిపించే దైవం నరసింహుడేనని దివ్య ప్రబంధాలు, వేద, తన వివిధ రూపాలను దర్శింపజేస్తూ అనుగ్రహిస్తున్నాడు. శ్రీయాదగిరి పంచ నారసింహుడిగా స్వయంభూవై వెలసి కోరిన వారికి కొంగు బంగారమై సిరి సంపదలను అందిస్తూ భక్తకోటిని అనుగ్రహిస్తున్నాడు. తన పట్ల అచంచలమైన భక్తి, విశ్వాసాలు కలిగి ఉన్న వారికి తాను వెన్నంటి ఉండి సంరక్షిస్తానని స్వామి వారి ఈ అలంకార సేవలో భక్తులకు దర్శనమిస్తున్నాడు.

నేటి నుంచి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం

అధ్యయనోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్టలో తాత్కాలికంగా నిలిపివేసిన స్వామి, అమ్మవార్ల నిత్య, శాశ్వత కల్యాణోత్సవం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవం, సుదర్శ నారసింహ హోమం నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు యథావిధిగా ఆర్జిత పూజలు కొనసాగుతాయని తెలిపారు.

లక్ష్మీనరసింహ స్వామి అలంకారం

ఘనంగా తిరుప్పావై పూజలు

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో అర్చకులు వేదమంత్రాలను పఠిస్తూ తిరుప్పావై పూజలు నిర్వహించారు. అర్చకులు గోదాదేవి శ్రీరంగనాయకుడిపై రచించిన పాశురాలను పఠించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం వేళలో స్వామి వారికి తిరువీధి, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళలో స్వామి వారి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేశారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఖజానాకు రూ.25,35,488 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

పానగల్‌లోని ఒకటో వార్డులో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్

● ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్

● నల్లగొండలోని వార్డుల్లో దరఖాస్తుల పరిశీలన

నల్లగొండ, డిసెంబర్ 28 : ప్రజా సంక్షేమం, అభివృద్ధి, మెరుగైన పాలన కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజా పాలన ఉమ్మడి నల్లగొండ జిల్లా నోడల్ ఆఫీసర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం ఐదు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను నల్లగొండ పట్టణంలోని పానగల్‌లో 1వ వార్డు, డైట్ కళాశాలలో 5వ వార్డు, 21వ వార్డులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో ఆయన మాట్లాడారు. దరఖాస్తులను ఎలా నింపాలో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులకు అధికారులు వివరాలు చదివి వినిపించి పథకం వారీగా సరిచూసుకొని నింపాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాలతోపాటు అభయ హస్తం గ్యారెంటీ పథకాలు పొందేలా దరఖాస్తుదారులు ఆయా పథకాల ఎదురుగా టిక్ మార్క్ చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకం కింద అర్హులు రూ.2500 ఆర్థిక సాయం దగ్గర టిక్ చేయాలన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ వద్ద టిక్ మార్క్ చేసిన వారు గ్యాస్ కంపెనీ పేరు, నెంబరు, సిలిండర్ల సంఖ్య నమోదు చేయాలని తెలిపారు. రైతు భరోసా పథకంలో భూముల వివరాలు, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు లేనివారు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం వద్ద టిక్ చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారు వివరాలు తెలుపాలని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల గృహ విద్యుత్ వినియోగం వివరాలు, చేయూత పథకంలో పింఛన్ల కోసం ఆయా విభాగం వద్ద టిక్ చేయాలన్నారు. దరఖాస్తులో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సూచించారు.

దరఖాస్తుదారులకు విధిగా రసీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో 48 వార్డుల్లో మున్సిపల్, అంగన్‌వాడీ, మెప్మా, ఆశ వర్కర్లతో 48 బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పది టీమ్‌లు ప్రత్యేకంగా అన్ని వార్డుల్లో పర్యటిస్తాయన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కూడా దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ చంద్రమోహన్, కౌన్సిలర్లు పున్న గణేశ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

కంబాలపల్లి లిఫ్ట్ భూముల పరిశీలన

చందంపేట, డిసెంబర్ 28 :చందంపేట మండలంలోని కంబాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన భూములను గురువారం అటవీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పరిశీలించారు. కంబాలపల్లి లిఫ్ట్ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో అటవీ శాఖ భూములను గుర్తించి హద్దులను నిర్ధారించినట్లు ఐఎఫ్ఓ రాజ్‌నాథ్, ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనాథ్ తెలిపారు. అటవీ శాఖ పరిధిలో ఎంత మేర భూమి లిఫ్ట్‌కు వర్తించనుందనేది నిర్ధారించడం కోసం భూ పరిశీలన చేపట్టినట్లు అధికారులు చెప్పారు. వారి వెంట ఇరిగేషన్ శాఖ డీఈ మనోహర్, ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, ఎఫ్ఆర్ఓ సాయి ప్రకాశ్, ఏఈ శివరాజ్ తదితరులు ఉన్నారు.

అటవీ భూములు పరిశీలిస్తున్న ఐఎఫ్ఓ రాజ్‌నాథ్, ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనాథ్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను

కలిసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నీలగిరి, డిసెంబర్ 28 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల తరువాత నల్లగొండ పట్టణంలో జరిగిన పరిస్థితులను వివరించారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పార్టీ అభివృద్ధికి పాటుపడాలని వారికి కేటీఆర్ సూచించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి

ఫుట్‌బాల్ అండర్ -17 తెలంగాణ టీమ్ కెప్టెన్‌గా నల్లగొండ వాసి

జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించనున్న వెంకటసాయి

నల్లగొండ రూరల్, డిసెంబర్ 28 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -17 బాలుర జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు కెప్టెన్‌గా నల్లగొండ పట్టణానికి చెందిన రాచూరి వెంకటసాయి ఎంపికయ్యాడు. కెప్టెన్‌గా ఎంపికైన వెంకటసాయిని చత్రపతి శివాజీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మపాల గిరిబాబు గురువారం అభినందించి మాట్లాడారు. మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన రాచూరి వెంకటసాయి చత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్ కోచ్ కరుణాకర్ వద్ద శిక్షణ తీసుకున్నాడని తెలిపారు. ఇటీవల జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎస్‌జీఎఫ్ తెలంగాణ జట్టుకు ఎంపిక కావడంతోపాటు రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడన్నారు. వెంకటసాయి ప్రస్తుతం నల్లగొండ ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడని తెలిపారు. కెప్టెన్‌గా ఎంపికైన వెంకటసాయికి పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా ఎంపికైన వెంకటసాయి

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, డిసెంబర్ 28 : జిల్లాలో స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్టు ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖాధికారి అన్నపూర్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుదారులు అర్హత నియమావళి, నిర్ణీత దరఖాస్తు ఫారానికి https:// yadadri.telangana.gov.in వెబ్ సైట్ నందు దరఖాస్తులు పొందాలని సూచించారు. దరఖాస్తులు ఈ నెల 28నుంచి జనవరి 5వ తేదీ సాయంత్రం 5గంటల వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. మరింత సమాచారానికి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, కలెక్టరేట్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.